## మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి




ఇనుగుర్తిలో సమ్మె చేస్తున్న జీపీ సిబ్బంది

సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ ఉద్యోగులు రెండు రోజుల టోకెన్ సమ్మెకు దిగారు. మొదటి రోజైన శుక్రవారం ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఇన్సూరెన్స్, బీమా సౌకర్యం కల్పించాలని, ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్ కలెక్టర్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని, జీవో 51ను ఎత్తివేయాలని, పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. –నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 27

## రైతు భరోసా పడిందా? రుణమాఫీ జరిగిందా?

- రైతులను ప్రశ్నించిన మాజీ మంత్రి దయాకర్‌రావు
- కేసీఆర్ సారున్నప్పుడే మంచిగుండె..
- కారు పార్టీకే అండగా ఉంటామన్న రైతులు, వృద్ధులు
- మోసపు మాటలతో రేవంత్ గద్దెనెక్కిండన్న ఎర్రబెల్లి



గట్టికల్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు ఎట్లున్నది?


రాయపర్తి, డిసెంబర్ 27 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పని చేస్తున్నది? రైతు భరోసా పడిందా? రూ. 2 లక్షలలోపు రుణాలు మాఫీ చేసిండా? ధాన్యం విక్రయించిన, బోనస్ డబ్బులు పడుతున్నాయా? అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రైతులను ప్రశ్నించారు. శుక్రవారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఊకల్ గ్రామానికి చేరుకున్న ఆయన రైతులతో ముచ్చటించగా.. అంతా మోసం జరుగుతున్నదని వారు సమాధానమిచ్చారు. అనంతరం గట్టికల్ గ్రామంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద ఆసరా పింఛన్ల కోసం బారులు తీరిన వృద్ధుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి పెంచిన పింఛన్లు ఇస్తున్నడా? అని అడిగారు. దీంతో వృద్ధులంతా కేసీఆర్ సారు ఉన్నప్పుడే మంచి గుండె.. ఇప్పుడు పింఛను ఎప్పుడొస్తున్నదో.. ఏ నెల బాపతివి ఇస్తున్నరో తెల్వడం లేదంటూ వివరించారు. భవిష్యత్‌లో కారు పార్టీకే అండగా ఉంటామని, కేసీఆర్‌నే గెలిపించుకుంటామంటూ ఎర్రబెల్లికి భరోసా ఇచ్చారు. అనంతరం ఎర్రబెల్లి మాట్లాడుతూ మోసపూరిత వాగ్ధానాలతో సీఎం రేవంత్‌రెడ్డి గద్దెనెక్కాడని ఫైర్ అయ్యారు. అబద్ధాల కాంగ్రెస్‌కు రాష్ట్రంలో నూకలు దగ్గరపడ్డాయన్నారు. ప్రజలను ఎంతో కాలం మోసం చేయలేరన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు దయాకర్‌రావు దుప్పట్లు పంపిణీ చేశారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిక..**

మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన నకిరేతు అశోక్‌కుమార్ ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో గొడవలు, అగ్ర కులాల ఆధిపత్యాన్ని సహించలేక తిరిగి ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు.

## పెరుగుతున్న మిత్తి భారం

పంట రుణాలకు సంబంధించి బ్యాంకుల నిబంధనలు ప్రత్యేకంగా ఉంటాయి. లోను తీసుకున్న ఏడాదిలోపు చెల్లిస్తే మిత్తి తక్కువగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ రాయితీ వర్తిస్తుంది. ఏడాదిలోపు పంట రుణం, మిత్తి చెల్లిస్తే వారం రోజుల్లోనే మళ్లీ లోను ఇస్తుంటాయి. బ్యాంకుల్లో మిత్తి తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు లోను తీసుకునేందుకు ఆసక్తి చూపుతారు. రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాల మాఫీ ప్రక్రియను సాగదీస్తుండడంతో రైతులపై ఆర్థికంగా భారం పడుతున్నది. రుణ మాఫీ పైసలు బ్యాంకుల్లో జమవుతాయనే ఆశతో రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ వైఖరితో ఈ నెలలోనే ఏడాది గడువు ముగుస్తున్నా అసలు, మిత్తి చెల్లించకుండా వాయిదా వేస్తున్నారు. దీంతో లక్ష రూపాయల లోనుపై కనీసం రూ.5 వేల వరకు అదనంగా మిత్తి అవుతున్నది. దీనికి తోడు కొత్త రుణం కోసం బ్యాంకుకు వెళ్లినప్పుడు సాంకేతిక సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



**పంట రుణం మాఫీ** చేశామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనకు, వాస్తవ పరిస్థితికి పొంతన కుదరడం లేదు. మొదటి మూడు దశల్లో వివిధ కారణాలతో రుణాలు మాఫీ కాని వారికి నాలుగో దశలో చేసినట్లు కాంగ్రెస్ సర్కారు నవంబరు 30న ప్రకటించింది. బ్యాంకు బ్రాంచీల వారీగా జాబితాలను అనధికారికంగా విడుదల చేసింది. పంట రుణాలు మాఫీ అయినట్లు, ఈ ప్రక్రియ పూర్తయినట్లు పదేపదే చెప్పకుంటున్నది. అయితే నాలుగో దశ మాఫీ ప్రకటించి నెల రోజులైనా ఏ ఒక్క రైతు ఖాతాలోనూ ఇప్పటికీ డబ్బులు జమచేయలేదు. దీంతో ఆందోళన చెందుతున్న రైతులు ప్రతిరోజూ బ్యాంకుకు వెళ్లి మాఫీపై వాకబు చేస్తున్నారు. అకౌంట్లలో డబ్బులు పడితేనే మాఫీ అయినట్లని, లేకపోతే కానట్లేనని బ్యాంకర్లు చెబుతుండడంతో అన్నదాతలు భయపడుతున్నారు. ఊరిలోని ఇతర రైతుల రుణాల పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. నాలుగో దశలోనూ రైతులందరి పరిస్థితి ఒకేలా ఉండడంతో ఏం చేయాలో తెలియక, ఎవరిని అడగాలో అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు.

- వరంగల్, డిసెంబరు 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# పైసలు పడలే..

**నాలుగో దశలోనూ అన్నదాతకు అన్యాయమే..**

- అర్హులైన రైతుల అకౌంట్లలో జమకాని డబ్బులు
- నెలరోజులైనా ఊసే ఎత్తని కాంగ్రెస్ సర్కారు
- రుణం చెల్లించక బ్యాంకుల్లో పెరుగుతున్న మిత్తి భారం
- సర్వత్రా వ్యక్తమవుతున్న ఆందోళన
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై అసంతృప్తి

అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అనేక హామీలిచ్చింది. రైతులకు రూ.2 లక్షలలోపున్న పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నిబంధనల పేరుతో రైతులకు అన్యాయం చేసింది. సగం మంది రైతులకు సైతం మాఫీ చేయలేదు. జూలైలో మాఫీ ప్రక్రియ మొదలు పెట్టి ఆ నెలాఖరులోనే రెండో, ఆగస్టులో మూడో దశలో రుణమాఫీ చేసినట్లు ప్రకటించింది. రేషన్‌కార్డు, కుటుంబం నిబంధనలు పెట్టి సగం మందికి మాఫీ వర్తించకుండా చేసింది. కుటుంబ సభ్యులందరి రుణం రూ.2 లక్షల కంటే ఎక్కువున్నా మాఫీ చేయలేదు. మొత్తంగా మొదటి మూడు దశల్లో పలు కొర్రీలతో సగం మందికిపైగా రైతులకు మాఫీ అమలు కాకుండా చేసింది. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఎమ్మెల్యేలను నిలదీశారు. దీంతో మేల్కొన్న రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీ అర్హుల గుర్తింపునకు సర్వే చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కారణం చూపి రెండు నెలలు సాగదీసింది. రేషన్ కార్డు లేని కుటుంబ సభ్యులు మండల వ్యవసాయ అధికారి వద్దకు వచ్చి ఫొటో దిగాలని నిబంధన పెట్టింది. ఇవన్నీ చేసినా అర్హులందరికీ రుణ మాఫీ ఎప్పుడనేది చెప్పకుండా తాత్సారం చేసింది. రైతుల ఉద్యమాలతో నాలుగో దశ మాఫీ ప్రక్రియను మొదలుపెట్టినట్లు నవంబర్ 30న ప్రకటించింది. ఇదే చివరి దశ అని, మాఫీ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పింది. అయితే అర్హుల జాబితాలోని ఏ ఒక్క రైతు ఖాతాలోనూ ఇప్పటికీ పైసలు జమ చేయలేదు. మూడు దశల తర్వాత ఎవరికీ పంట రుణం మాఫీ కాలేదు.







మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు

# ఆర్థిక సంస్కరణల్లో చెరగని ముద్ర

- మన్మోహన్ సేవలు మరువలేనివి
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణ కాలనీ, డిసెంబర్ 27: భారతదేశ ఆర్థిక సంస్కరణల్లో చెరగని ముద్ర వేసిన మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆయన మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జీఎంఆర్‌ఎం ట్రస్ట్ సీఈవో, చైర్మన్ గండ్ర గౌతంరెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ దేశం ఆర్థికంగా క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో ఆర్థిక రంగ నిపుణుడిగా కీలకపాత్ర పోషించారని కొనియాడారు. భారత ప్రధానిగా మన్మోహన్ సింగ్ హయాంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని, ఉద్యమాన్ని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన మరణం భారతదేశానికి తీరని లోటని అన్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్‌ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సగం వెంకటరాణి, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ నూనె రాజు, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, మంగళపల్లి తిరుపతి, ముంజంపల్లి మురళీధర్, ఎడ్ల మౌనిక, బానోత్ రజిత, మేకల రజిత, బీఆర్‌ఎస్ నాయకులు కళ్లెపు రఘుపతి రావు, మాడ హరీశ్‌రెడ్డి, గొర్రె సాగర్, మెతుకు తిరుపతి రెడ్డి, బుర్ర రాజు, మండల విద్యాసాగర్ రెడ్డి, బండారు రవి, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, పిల్లి వేణు, దొండ్ర కుమార్, మోతె రాజు, చిన్నాల ప్రవీణ్, శేఖర్, కృష్ణమూర్తి, యూత్ నాయకులు మహేందర్, యుగేంద్రాచారి, భాస్కర్, మనోహర్, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, గండ్ర యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.





భూపాలపల్లిలోని కేటీకే –5 ఇంక్లైన్ వెళ్లే రోడ్డుపై వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

అంబేద్కర్ సెంటర్‌లో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు


# తాగు నీరు వృథా.. కాలనీవాసుల వ్యథ

- భూపాలపల్లిలో పగిలిన మిషన్ భగీరథ పైపులైన్
- చెరువును తలపిస్తున్నా పట్టించుకోని అధికారులు

కృష్ణ కాలనీ, డిసెంబర్ 27: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఓ వైపు మిషన్ భగీరథ ప్రధాన పైపులైన్ పగిలి తాగు నీరు వృథా పోతుండగా, మరో వైపు సుభాష్, కారల్‌మార్క్స్, పైలట్ కాలనీ తదితర ప్రాంతాల్లో మంచి నీళ్లు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ నెట్‌వర్క్ కేబుల్ వేసేందుకు ప్రైవేట్ వ్యక్తులు గుంత తీస్తుండగా మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా వృథాగా పోతూ కేటీకే–5 ఇంక్లైన్ వెళ్లే ప్రధాన రహదారిపై నుంచి నూతనంగా నిర్మిస్తున్న ఇంటలిజెన్స్ పోలీస్ విభాగం జిల్లా కార్యాలయం చుట్టూ పెద్ద ఎత్తున చేరింది. అసలే గత నాలుగు రోజులుగా కాలనీల్లో తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే వచ్చే మిషన్ భగీరథ నీళ్లు వృథాగా రోడ్లపై ప్రవహిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంలో కాలనీవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు వెంటనే చేపట్టి మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా పైపులైన్ లీకేజీతో మున్సిపాలిటీకి ఎలాంటి సంబంధం లేదని, మిషన్ భగీరథ అధికారులే చూసుకోవాలని తెలిపారు.

# మిమిక్రీ లెజెండ్ నేరెళ్ల..

- ధ్వన్యనుకరణలో అంతర్జాతీయస్థాయికి..
- భర్త అడుగజాడల్లో సతీమణి శోభావతి
- నేడు వేణుమాధవ్ జయంతి
- మిమిక్రీ శ్రీనివాస్‌కు నేరెళ్ల స్మారక పురస్కారం



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణం, నేరెళ్ల విగ్రహం



నేరెళ్ల జీవిత భాగస్వామి శోభావతి

పోచమ్మమైదాన్, డిసెంబర్ 27: ఓరుగల్లుకు చెందిన నేరెళ్ల వేణుమాధవ్ ప్రపంచవ్యాప్తంగా వేలాది మిమిక్రీ ప్రదర్శనలతో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్నాడు. అందరినీ కడుపుబ్బ నవ్విస్తూ, ఆలోచనలు రేకెత్తిస్తూ ధ్వన్యనుకరణ సామ్రాట్ బిరుదు పొందాడు. ఆయన మనమధ్య లేకపోయినా ఆయన తయారు చేసిన కళాకారులు ఎందరో ఉన్నారు. వేణుమాధవ్ 2018 జూన్ 19న వరంగల్‌లో కన్నుమూశారు. డిసెంబర్ 28న నేరెళ్ల వేణుమాధవ్ జయంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలు. వరంగల్ మట్టెవాడలోని శ్రీహరి, శ్రీలక్ష్మి దంపతులకు 1932, డిసెంబర్ 28న జన్మించారు. హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చదువుకుంటూ ఇంగ్లిషు సినిమాలు చూసి, వాటిల్లో ఆర్టిస్టుల గొంతులు, ముఖ్య సన్నివేశాలను బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌ను వినిపిస్తూ అందరినీ అలరించేవారు. తర్వాత హనుమకొండ, ధర్మసాగర్, మట్టెవాడ, జనగామ, శంభునిపేట పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసి, అనేక మిమిక్రీ ప్రదర్శనలతో విద్యార్థులను ఆకట్టుకునేవారు. డిగ్రీ పూర్తి చేసిన తర్వాత 1947లో తొలి ప్రదర్శన ఇచ్చి మంచి పేరు తెచ్చుకున్నారు. 1953లో రాజమండ్రిలో మలి ప్రదర్శన ద్వారా మిమిక్రీలో మరెంతో ఎదిగారు. 1957, ఫిబ్రవరి 3న శోభావతిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు శ్రీనాథ్, రాధాకృష్ణ, ఇద్దరు కుమార్తెలు లక్ష్మీతులసి, వాసంతి ఉన్నారు. శోభావతి భర్త అడుగుజాడల్లో నడుస్తూ, వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆటోనగర్‌లోని అంధుల పాఠశాలను దత్తత తీసుకుని ప్రతి నెల ఉపాధ్యాయులకు రూ.10వేల వేతనం చెల్లించడంతో పాటు ఫస్ట్ ఫ్లోర్‌లో భవన నిర్మాణం, ఇతర వసతులు కల్పించారు.


**అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు..**

1947 నుంచి మిమిక్రీ ప్రదర్శనలకు శ్రీకారం చుట్టిన వేణుమాధవ్ అంచెలంచెలుగా ఎదుగుతూ అంతర్జాతీయస్థాయికి తీసుకువెళ్లారు. తెలంగాణలోని ఓరుగల్లు కీర్తి ప్రతిష్టతలను ఇనుమడింపచేశారు. తెలుగులోనే కాకుండా ఇతర భాషల్లో కూడా మిమిక్రీ ప్రదర్శనలు ఇస్తూ నలుదిశలా పేరు సంపాదించుకున్నారు. ఐక్యరాజ్యసమితిలో కూడా ప్రదర్శన ఇచ్చి దేశానికి గుర్తింపు తీసుకవచ్చారు. నేరెళ్ల వేణుమాధవ్ పేరు మీద హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ప్రత్యేకంగా కళా ప్రాంగణాన్ని నిర్మించారు. విగ్రహాన్ని సైతం ప్రతిష్టించారు. నేరెళ్ల వేణుమాధవ్ 1972 నుంచి 1078 వరకు ఎమ్మెల్సీగా, 1972 నుంచి 1975 వరకు ఏపీ లెజిస్లేటివ్ కమిటీ సభ్యుడిగా, 1974 నుంచి1978 వరకు సంగీత నాటక అకాడమీ సభ్యుడిగా పనిచేశారు. పలు యూనివర్సిటీల నుంచి అవార్డులు, డాక్టరేట్లు అందుకున్నారు. 2018లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారం, 2015లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. అనేక బిరుదులు సంపాదించుకున్నారు.

**నేటి నేరెళ్ల కార్యక్రమాలు..**

వేణుమాధవ్ 93వ జయంతి సందర్భంగా శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల ప్రాంగణంలో సాయంత్రం 5 గంటలకు స్వరార్చన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన శిష్యులు మిమిక్రీ చేయనున్నారు. కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, స్థానిక మిమిక్రీ ఆర్టిస్టులు పాల్గొంటారు.

**మిమిక్రీ శ్రీనివాస్‌కు పురస్కారం..**



తోటి కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో నేరెళ్ళ వేణుమాధవ్ కల్చరల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ఆయన పుట్టిన రోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక కళాకారుడిని ఎంపిక చేసి వారికి రూ. పదివేలు అందజేసి, పురస్కారంతో సత్కరిస్తారు. ఈ సంవత్సరం ఆయన ప్రియ శిష్యుడు కేసముద్రానికి చెందిన మిమిక్రీ శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. కాగా శ్రీనివాస్ అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన వెంట్రిలాక్విస్టు, మిమిక్రీ కళాకారుడు. భారతదేశంలో తొలి ధ్వని ఇంద్రజాలికుడు.

## సర్కారు కండ్లు తెరిపించాలి



నెక్కొండ: గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్‌లు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 27: 'ఓ మహాత్మా.. సర్కారు కండ్లు తెరిపించు.. అని శుక్రవారం మాజీ సర్పంచ్‌లు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోయినప్పటికీ అప్పులు తెచ్చి పనులు చేశామన్నారు. సర్కారు బిల్లులు చెల్లించకపోవడం కారణంగా అప్పులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించిన తర్వాతే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



జనగామలో ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 27: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న దీక్షలు శుక్రవారానికి 18వ రోజుకు చేరుకున్నాయి. జనగామలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, మహబూబాబాద్‌లో దివ్యాంగులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా మౌనం పాటించారు. విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సినీ పరిశ్రమ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వానికి సమయం దొరికింది కానీ ఆకలిదప్పులతో తల్లడిల్లుతున్న ఉద్యోగులను పిలిచి చర్చించిన పాపాన పోలేదని ఎద్దేవా చేశారు.